నాన్న

శర్మాని

నాన్నకి పిచ్చెత్తి ఆర్నెల్లయింది. వారంరోజుల్నించి మరీ ఎక్కువకేకలు. వొక్కరవ్వన్నా నిద్రపోడు. రెండు మూడురోజులు పగలూ రాత్రీకూడ మేమంతా నిద్రలు మానుకుని నాన్నని నిద్రపుచ్చేందుకి చేసిన అన్ని ప్రయత్నాలూ అంతా వ్యర్థం. ఇహ మరి 'ఉహూ' అని మా నిద్రల్ని పలకరించాం.

నాన్న కేకలు ఎంతవేస్తున్నాకూడ మా నిద్రకి ఏమీ అడ్డు రాలేదు. సగం నిద్రలోంచి ఎందుకో ఛప్పున తెలివివొచ్చింది. అంతా ప్రశాంతంగవుంది. ఇంత నిశ్శబ్దం ఎక్కణ్నించి వొచ్చిందా అని చుట్టూరాచూశాను. కిటికీలోంచి తోటలో పువ్వులు మెత్తని వెన్నెల్లో.

మెల్లిగా నా అడుగుల చప్పుణ్ని వింటో అటు కదిలాను. ఎన్నాళ్ళదోవిన్న ఎదో గొంతు ఎంతో ప్రియంగ ఏమిటో అస్పష్టంగ అంటోంది. ఎవరది?

ఛప్పున నాన్న జ్ఞాపకం వొచ్చారు. ఎన్నాళ్ళయింది నాన్న ఈ గొంతువిని. ఇన్నాళ్ళూ నాన్న ఎదో దేశంవెళ్లి ఈ రాత్రికి తిరిగివొచ్చాడా అని—ఇది చాలా నిజం అనుకుని ఎంతో సంతోషంతో నావొళ్ళంతా పెద్దగొంతుతో గానం చేసింది. కాని మళ్ళా నాలుగ్గంటల కింద నాన్న వేస్తోన్న కేకలు, నిద్రలోంచికూడ నన్ను వొదలక వెంబడిస్తోన్న కేకలు అంతా ఏమయింది నాలోంచి వొస్తోన్న ఈప్రశ్న నన్ను బాధిస్తోనే వుంది.

ఏ చప్పుడికి మళ్ళా నాన్న కేకలుగామార్తాడో అన్న దిగులుతో మెల్లిగా ఆ పూర్వకాలపు ప్రియమైన గొంతుతోవున్న నాన్నని చూడాలని నడిచాను.

అమ్మ అటువైపుచూస్తో పడుకునివుంది. నాన్న నుంచుని వున్నాడు. బట్ట సగం విడివుంది. అమ్మ చెయ్యిపట్టుకుని లాగుతున్నాడు. రమ్మంటున్నాడు—ఎంతో జాలిగ ప్రేమతో కోరికతో. వొళ్ళంతా కోరికకళ్ళతో, ఆకళ్ళల్లో ఏది అమ్మని మాయపెట్టిందో గాని అమ్మ రానంటోంది. 'వొక్కసారి' అని మెల్లిగ నాన్న అతి నాజూకుతో గట్టిగ లాగుతున్నాడు. అమ్మ నీమాట ఎందుకో కూర్చోపెట్టింది. ఛప్పున తిరిగిచూసింది అమ్మ నావైపు—ఈ కోరికతో ప్రియంగ రమ్మని అమ్మని పిలుస్తోంది కొంతకాలా కిందట రోగంతో బాధతోకేకలువేసిన నాన్నేనా అని ఆశ్చర్యంతోచూస్తోన్న నావైపు. "ఇంత ఈడొచ్చి....ఇంత రోగం తెచ్చుకుని....ఇంత మంది పిల్లల్ని....ఛీ....సిగ్గులేదూ....ఇంకా...." ఇదే వరసలో అరుస్తోంది అమ్మ, నాన్న తన ప్రయత్నం వొదలడంలేదు. వొక్కవూపుతో అమ్మ నాన్న చేతుల్ని దులిపి పళ్ళ బిగించి నుంచుని కళ్ళు పెద్దవిచేసి 'కొట్తా దగ్గరొస్తే' అని అమ్మ-అమ్మేనా అని ఆశ్చర్యపొయ్యాను. ఎదో చెప్దాం అని ఎదీ చెప్పలేక పోయ్యాను. ఇన్నాళ్ళూ ఇంత రోగంతో బాధతో దాహంతో కేకలు వేసి వేసి అలసిపోయిన నాన్న అమ్మని "వొక్కసారి" అని జాలిగ పిలుస్తోంటే,—పూర్వకాలపు ప్రియమైన తీపి చూపులతో పిలుస్తోంటే రానంటోంది అమ్మ, ఆ నిమిషాన అమ్మని వొళ్ళంతా బలంతో బిగ్గరగా కొట్టాలనిపించింది. కాని అంత నీరసం నన్ను ఆవరించి అక్కణ్నించి మెల్లిగ కదిలాను.

నిశ్చలంగ పువ్వులు మెరిసే వెన్నెల్లో ఎంతో తియ్యని నిద్రలో సంగీతం వింటో నిశ్చలంగ;—

అవును. అమ్మని ఏం అనడానికీ ఏముందీ నాకు అధికారం, అమ్మ ఇంతకీ ఏం తప్పు చేసింది. రోగం మనిషిని నిరాకరించడం ఆరోగ్యవంతమేకాదా, అదీగాక ఎవరిదేహంమీద వారికి సంపూర్ణాధికారంవుందీ; వుండాలీ; అనే కదా ఈనాటి వాదన. పిచ్చిరోగంతోవున్న తనికి కోరిక వుండడంలో అయితే ఆశ్చర్యంలేదు కాని, అది తీర్చడం భార్య అవునా? బాధ్యతా ఈ మాదిరి కలయిక రోగం సంతానానికి బీజంకూడానూ.

కానీ,—వొక మనిషి తన అన్ని అవయవాలతో, అంత హృదయంతో. అంత కోరికతో, ఇంకో మనిషిని. ఇంకో హృదయాన్ని, ఇంకొన్ని అవయవాల్ని—ఇంకెవర్నీ కాదు. తనతో ఇన్నాళ్ళూ నీడగ నడిచిన భార్యని—అంత దయతో, ప్రియంగ. జాలిగ వేడుకుంటోంటే, ఏరోగంరానీ తరవాత ఆలోచించుకోవచ్చు. ఇప్పటికీ శాంతి అని ఆ మనిషిని తనలో నిద్రపుచ్చక నిరాకరించడం,—నిరాకరించగలడం—అమ్మా! నువ్వు అమ్మవికావే!

నాకళ్ళముందున్న ఆ పువ్వుల్లో ఎంతో కోరికతో తీరని వేదన పడుతోన్న నాన్న బరువు నిద్ర కళ్ళు కనపడి వొళ్ళంతా పెద్ద దిగులుతో నన్ను వొదలకండా బాధ. ఆక్షణాన జ్ఞానోదయమయింది నా లోపల లోపల, గబగబా నాన్నగదిలోకి వెళ్ళాను. అదే సీన్. నాన్న రమ్మంటున్నాడు. అమ్మ 'ఉహూ. ఉహూ' అంటోంది

వుండుండి నిద్రలోంచి. మరి ఎంతసేపటికీ ఇల్లాగే అంటోంటుంది అమ్మ. ఇంతలో నాన్న మళ్లా కేకలు ఆరంభం. మరి మించిపోకూడదు అని నాన్నని. నాగది వైపున 2 పెంచానునెమ్మదిగ. నిద్రలోంచి చప్పున లేచి ఆశ్చర్యంతో వొక్కసారి కళ్ళని నావైపు నిలిపి కళ్ళు నులుపుకుంటూ మళ్లా నిద్రపోయింది అమ్మ.

నాగదిలో దంగుడీపంచేసి నాపక్కమీద కూర్చోబెట్టాను నాన్నని. అగరొత్తులు వెలిగించి నాన్నవైపుచూశాను. ఆశ్చర్యంతో నాన్న అంతాచూసి కళ్ళని నామీద నిలిపాడు. ఆకళ్ళల్లోకి చూస్తూ ఆపక్కలో పడుకున్నాను.

నా వొళ్ళంతా పరిచి నాన్నముందు పడుక్కోపెట్టి దూరం నుంచి దీన్నంతా చూస్తున్నట్టుంది నాకు. నాన్న చేతులతో నావొళ్ళంతా స్పృశించాను. ఆ స్పర్శలో ఏ శక్తివుందో, లేక మరి ఆరాత్రి రతీదేవి కరుణించి నాకు వరాల్ని కురిపించిందో, ఏమోగాని, నావొళ్ళంతా ఎంతో నిండుగ అనిపించింది నాకు. రెప్పవాల్చక నాన్న మెడ వెనక వేళ్ళతో నాలోని సంగీతానికి స్మృతివాయిస్తో చూస్తోన్నాను నాన్న కళ్ళని. వొక్కరవ్వన్నా మాట్లాడడు నాన్న. ఏమాయింది ఆ కేకలు అంతా. కేకలుపోయి మూగవచ్చిందా! ఏమాలోచిస్తున్నాడో తెలీదు. ఆకళ్ళల్లో—బరువు నిద్రతీరని దాహం మండుతోన్న ఆకళ్ళల్లో—ఏదో వేడివెన్నెల వొక్కసారిగ వెలిగి వొళ్ళంతా ప్రవహించినట్టయింది. నాకళ్ళనీ, భుజాల్నీ, పెదిమెల్నీ, వొళ్ళంతా, తన వొళ్ళంతటితో ముద్దుపెట్టుకుంటో—నా రొమ్ములమధ్య తనకళ్ళని నిద్రపోనిచ్చాడు చివరికి.

నా రొమ్మంతా వేడిగా తడుస్తోంది. ఏడుస్తున్నాడే నాన్న. ఏమో, చూడాలనివుందికాని నాన్నని వొదలాలని లేదు. ఏ కదలికకు మళ్లా నాన్న ఏ కేకలుగ మార్తాడో జీవితమంతా నాన్నని నారొమ్ముల మధ్య అల్లా నిద్రలో జోకొట్టకలుగుతే నాకళ్ళు సంతోషంలో మూసుకుంటున్నాయి.

కాని నేను అప్పుడు నిద్రలోకి జార్తే ఇదంతా నిజంకాక కలగా మారి కరిగిపోతుందో ఏమో. మెత్తగా వేళ్ళని మెడవెనక వాయిస్తో నాలోని నిశ్శబ్దం సంగీతాన్ని వింటో నాన్న వుంగ్రాల జుత్తువైపు చూస్తోన్నాను కన్నీళ్ళతెరల్లోంచి. వెచ్చని కన్నీళ్ళ తడిలో నాన్న ముఖం నారొమ్ములమధ్య:—నిండుగా, బిగ్గరగా, గర్వంతో, ఆనందంతో వూగే నారొమ్ములమధ్య,—కేకలు రోగంతో తీరని దాహంతో అలిసిపోయిన కన్నీళ్ళ నాన్న నిద్ర.

రచయితలకు వినతి

యుద్ధకాలంలో యేమి రాయడమో అంటూ — కిందటి చిత్రగుప్తలో కొంచం చర్చచేసిన దానిమీద కొందరు రచయితలు అనేక ప్రశ్నలు వేశారు.

ఇతరభాషలలోని కథల స్వరూపాన్ని ఆంధ్రులకు బాగా పరిపయం చేస్తూ వున్నది చిత్రగుప్త; అందుకు ఆంధ్రులు చిత్రగుప్తను ప్రేమిస్తున్నారు. ఇంకముందు అనువాదములే అసలు వేయరా అంటూ కొందరు వ్రాస్తున్నారు.

చిత్రగుప్త అటువంటి శపథం యేమీ చేయలేదు. ఒకభాషలోని రచనను యింకొక భాషలోకి అనువదించడమంటే ఆ మాతృకలో యేదో కొత్తపోకడయో, వింతయో, మన సారస్వతంలో లేని నడకయో యేదో వొకటి వుండాలి.

తరువాత ప్రస్తుతం వచ్చే అనువాదాలలో యెన్నో వృథాక్రింద త్రోసి పారవేయవలసివస్తున్నది. చాలామంది యీనాటికీ రవీంద్రుని కథలు, ప్రేమచందు కథలు, టాల్‌స్టాయి రచనలు అనువదించి పంపుతూవున్నారు. వీరి రచనలు యిదివరలో అనేకమారులు అనేక పత్రికలలో వెలువడ్డాయి. అందువల్ల తిరుగా వాటినే అనువదించడము అచ్చువేయడము ఉపయోగములేని శ్రమ. కనుక కొత్త రచనలు, ప్రత్యేకతగల రచనలు వుంటేనే వాటిని అనువదించండి. లేకపోతే స్వంతంత్ర రచనలే ప్రచురిద్దాం.

Bodhi